క్లుప్తంగా

పౌష్టికాహార పంపిణీ



నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డులోని కేన్సర్ ఆస్పత్రిలో 30 మంది కేన్సర్ బాధితులకు పౌష్టికాహారాన్ని అబైడింగ్ హోప్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్, కేన్సర్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ లక్ష్మి, చీఫ్ ఆంకాలజిస్ట్ గీత, సెంట్రల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్, జయప్రకాష్, డేవిడ్ లివింగ్‌స్టన్, కన్యాకుమారి పాల్గొన్నారు.

అవాస్తవాల ప్రచారాన్ని కట్టిపెడితే మంచిది

• సోమిరెడ్డికి కాకాణి హితవు

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో సర్వేపల్లి నియోజకవర్గంలో అనేక అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపిస్తున్నా, వాటిని నిరూపించలేకపోతున్నారని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రెవెన్యూ, విజిలెన్స్ అధికారులను బెదిరించి, తప్పుడు నివేదికలు పంపాలంటూ ఆర్నెల్లుగా యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇతరుల భూములను కాజేస్తూ, వాటికి దొంగ రిజిస్ట్రేషన్లు చేసి ఇడిమేపల్లి వద్ద ఆయన అడ్డంగా బుక్కయ్యారన్నారు. అవకతవకలు జరిగాయని అధికారులు నేటికీ నిర్ధారించలేదని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో ఏమైనా అవకతవకలు జరిగి ఉంటే, అధికారులతో విచారణ జరిపించి నిగ్గుతేల్చాలని సవాల్ విసిరారు. సోమిరెడ్డి మాట్లాడే మాటలను తాము పట్టించుకోమని పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో అత్యంత పారదర్శకంగా వేలాది ఎకరాల భూమిని పంపిణీ చేసిన ఘనత తమ పార్టీకే దక్కుతుందని చెప్పారు.

పందుల పట్టివేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53, 54వ డివిజన్ల పరిధిలో గల నల్ల కాలువ, జనార్దన్‌రెడ్డి కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, టిడ్కో గృహ సముదాయాల్లో పందులను పట్టుకుంటున్నారు. ఈ ప్రాంతంలో పందుల బెడద ఎక్కువగా ఉండటంతో వాటి పెంపకందారులకు కార్పొరేషన్ అధికారులు నోటీసులను జారీ చేశారు. ఈ క్రమంలో వీటిని పెంపకందారులు పట్టి దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

కనులపండువగా నగరోత్సవం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురంలో అయ్యప్పస్వామి నగరోత్సవాన్ని కనులపండువగా శుక్రవారం నిర్వహించారు. తొలుత ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, భక్తిగీతాలు, కోలాటాల నడుమ నగరోత్సవం సాగింది. అయ్యప్ప భక్త బృందం, మిత్రమండలి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

• కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అవసరమైన భద్రత చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను డీటీసీ చందర్ వివరించారు. గత సమావేశంలో కలెక్టర్ ఆదేశాల మేరకు పలు నిర్ణయాలను అమలు చేయగా, మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేశాక కార్యాచరణ నివేదికతో హాజరుకావాలని సూచించారు. నగరంలో సిగ్నళ్లను త్వరితగతిన అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కనుపర్తిపాడు జంక్షన్ వద్ద లైటింగ్‌ను మరింత పెంచాలని సూచించారు. జాతీయ రహదారిపై పశువులు సంచరించకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జాతీయ రహదారి ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో తనిఖీలను ముమ్మరంగా చేపట్టి, వాహనదారులు హెల్మెట్లు ధరించేలా చూడాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి

నగరంలో ఎంపిక చేసిన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను త్వరగా ఏర్పాటు చేసి, పోలీస్, మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలని కోరారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలకు బ్రీత్ అనలైజర్లను రెడ్‌క్రాస్ సహకారంతో అందించనున్నామని చెప్పారు. పొదలకూరు రోడ్డులో డివైడర్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నగరంలో ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు ప్రదేశాలను త్వరగా ఎంపిక చేయాలని తెలిపారు. ఎన్‌హెచ్ డీజీఎం గోవర్ధన్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎమ్మెక చౌదరి, ఏఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కమిషనర్ నందన్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ అశోక్‌కుమార్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఆర్ అండ్ బీ ఈఈ మురళీకృష్ణ, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సహకరించాలి

నెల్లూరు(అర్బన్): కృష్ణా జిల్లాలో పండించిన ధాన్యాన్ని సేకరించి నెల్లూరుకు తరలించేలా జిల్లాలోని రైస్ మిల్లర్లు సహకరించాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నేతలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు మిల్లర్లు వారి వాహనాల్లో హమాలీలతో పాటు గన్నీ బ్యాగులను కృష్ణా జిల్లాకు పంపాలని కోరారు. అక్కడ ధాన్యాన్ని సేకరించే విషయమై మిల్లర్స్ అసోసియేషన్ నేతల సందేహాలను నివృత్తి చేశారు. సుబ్రహ్మణ్యంరెడ్డి, కోటేశ్వరరావు, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను నిర్వహించాలని వినతి



డీఎంహెచ్‌ఓతో మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ నేతలు కోరారు. ఈ మేరకు సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్యకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి షారూఖ్ మాట్లాడారు. చలి తీవ్రత పెరగడం, ఇటీవల కురిసిన వర్షాలతో పరిసరాల్లో నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు విషజ్వరాల బారిన పడుతున్నారని చెప్పారు. సంఘ నగరాధ్యక్షుడు ఆశీర్వాదం, ఉపాధ్యక్షుడు మస్తాన్, సహాయ కార్యదర్శి నవీన్, హర్షభాను తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదివి ఉన్నతంగా ఎదగండి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

నెల్లూరు(బృందావనం): విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని పూర్వ డీఈఓ రమేష్ పేర్కొన్నారు. నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు స్టడీ ప్లస్ కార్యక్రమాన్ని పురమందిరంలో ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ డొమినిక్‌రెడ్డి, కో కన్వీనర్లు రమేష్‌బాబు, చంద్రశేఖర్ ప్రణవ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం 600 మందికిపైగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు.

తొలుత రత్నం విద్యాసంస్థల అధినేత రత్నం చిత్రపటానికి నివాళులర్పించారు. తిరుపతికి చెందిన కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ సుధాకర్‌రెడ్డి, విద్యావేత్త సిస్టర్ రోసీ పరాక్కల్ తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. ట్రాఫిక్ పోలీస్



గుంతలను పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు

నెల్లూరు(క్రైమ్): అసలే అంతంతమాత్రంగా ఉన్న రహదారులు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. రామలింగాపురం జంక్షన్ నుంచి హరనాథపురం వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు ప్రమాదభరితంగా మారాయి. దీంతో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవడంతో పాటు పలువురు వాటిలో పడి గాయపడుతున్నారు. ఈ క్రమంలో నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పర్యవేక్షణలో గుంతలను కంకర, ఇటుక రాళ్లు, సిమెంట్‌తో సిబ్బంది శుక్రవారం పూడ్చారు. పోలీసుల చర్యలను పలువురు అభినందించారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ

నెల్లూరు(సెంట్రల్): కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరిని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఢిల్లీలో శుక్రవారం కలిశారు. వివిధ అంశాలపై ఆయనతో మాట్లాడారు.

జర్నలిస్టులకు ఇళ్లు నిర్మిస్తాం

నెల్లూరు(బారకాసు): నగరంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు సిటీ పరిధిలో అత్యాధునిక వసతులతో ఇళ్లను నిర్మించిస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ హామీ ఇచ్చారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో మంత్రికి వినతిపత్రాన్ని జర్నలిస్ట్ నేతలు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. నెల్లూరు నగర పరిధిలో వచ్చే ఏడాది మార్చిలోపు స్థల సేకరణ చేసి అధునాతన వసతులతో ఇళ్లను నిర్మించిస్తామని వివరించారు.

వేడుకగా శీవేలి ఉత్సవం

నెల్లూరు(బృందావనం): మండల పూజలను పురస్కరించుకొని నగరంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో శీవేలి ఉత్సవం తదితర కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా గండవరపు వినోద్‌రెడ్డి, దీపా, వంశీకృష్ణారెడ్డి, అర్చన దంపతులు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పాటలు, డ్యాన్స్ పోటీలు రేపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో పాటలు, డ్యాన్స్ పోటీలను ఆదివారం నిర్వహించనున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను పురమందిరంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆసక్తి గల వారు 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఆనంద్, రమణయ్య, రవీంద్ర, రఘురామిరెడ్డి, అమానుల్లాఖాన్, గోవర్ధన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులను చేపట్టనున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలోని టిడ్కో గృహ సముదాయం తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

• శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని మూడో మైలు, ప్రశాంతినగర్, రాజీవ్‌గాంధీ కాలనీ, మధురానగర్, పప్పిలిపాడు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

9 నుంచి టీటీడీ క్యాలెండర్లు, డైరీల విక్రయం

నెల్లూరు(బృందావనం): టీటీడీ ఆధ్వర్యంలో ముద్రించిన స్వామివారి క్యాలెండర్లు, డైరీలను నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం నుంచి విక్రయించనున్నామని మేనేజర్ విజయనిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాలెండర్‌ను రూ.130.. డైరీని రూ.150 చొప్పున విక్రయించనున్నామని పేర్కొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ తదితరులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని జీజీహెచ్‌తో పాటు పలు ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాలను ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, జిల్లా మాస్ మీడియా అధికారి కనకరత్నం తదితరులు శుక్రవారం తనిఖీ చేశారు. కిమ్స్, ఐశ్వర్య ఫెర్టిలిటీ, అమృత చెస్ట్ ఆస్పత్రుల్లో తనిఖీలను నిర్వహించి రికార్డులు, నివేదికలు, ఫారమ్ – ఎఫ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలీ మాట్లాడారు. స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలను ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదని స్పష్టం చేశారు. ఎక్కడైనా నిర్వహించారని తేలితే వాటిని సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. ధరల పట్టికను ప్రదర్శించడంతో పాటు స్కానింగ్ చేయించుకున్న గర్భిణుల వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలని కోరారు. డీఎల్సీఏ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, కుసుమకుమారి, క్షయ విభాగ జిల్లా కో ఆర్డినేటర్ విజయకుమార్ పాల్గొన్నారు.

కమనీయం వెంకటేశ్వరుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా శుక్రవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా పేరకం శ్రీనివాసులు, వసుధారాణి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తాతా వెంకటకిషోర్‌కుమార్, తన్నీరు మస్తాన్‌రావు, కోశాధికారి సోమిశెట్టి వెంకటరత్నం, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేస్తున్న టెక్నీషియన్

నెల్లూరు(అర్బన్): నగరంలోని నాలుగో మైలులో గల దొరతోట కాలనీకి చెందిన జగదీష్ (20) రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మరణించారు. ఈ క్రమంలో ఆయన నేత్రాలను ప్రభుత్వ వైద్యశాలకు కుటుంబసభ్యులు దానం చేశారు. నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99595 89321, 93471 11033 నంబర్లను సంప్రదించాలని కోరారు.

➡ అనుమసముద్రంపేట మండలం జమ్మవరానికి చెందిన రాజరాజేశ్వరి తన నివాసంలో మరణించారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను సాక్ష్యం నేత్రదాన సంస్థ అధ్యక్షుడు తిరుపతిస్వామి సహకారంతో నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రికి దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు.



జగదీష్ (ఫైల్)

సమస్యల పరిష్కారానికి వినతి



మంత్రికి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో పలు క్యాడర్లకు సంబంధించిన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కోరారు. ఈ మేరకు ఏసీనగర్‌లో మంత్రి నారాయణకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ తదితర అంశాలను తెలియజేశారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తాం



రెవెన్యూ సదస్సులో మంత్రి నారాయణ

నెల్లూరు(సెంట్రల్): పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఏసీనగర్‌లోని ఓ కల్యాణ మండపంలో రెవెన్యూ సదస్సును కలెక్టర్ ఆనంద్‌తో కలిసి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రెవెన్యూ శాఖలో లోపాలను సరిదిద్ది అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసినా.. ప్రైవేట్ ఆస్తులను లాక్కున్నా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

గోశాలకు ఆవుల తరలింపు



నెల్లూరు(బారకాసు): ప్రధాన రోడ్లపై వాహనదారులకు అడ్డంకిగా మారిన పశువులపై యజమానులు బాధ్యత వహించకపోతే కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ వెటర్నరీ వైద్యాధికారి మదన్‌మోహన్ పేర్కొన్నారు. వీఆర్సీ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, పొదలకూరు రోడ్డు ప్రాంతాల్లో సంచరిస్తున్న ఆరు గోవులను కల్లూరుపల్లిలోని గోశాలకు శుక్రవారం తరలించారు. అనంతరం పందుల పెంపకందారులకు నోటీసులను అందజేశారు. జనావాసాల మధ్య పందులను వదిలితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న రమేష్

నెల్లూరు (పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లో సహజ వనరులను సద్వినియోగం చేసుకొని.. అందుబాటులో ఉన్న నిధులతో గ్రామాలను అభివృద్ధిలోకి తీసుకురావాలని ఏపీఎస్సైఆర్డీ అధికారి రమేష్ సూచించారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయాధికారులు, వైద్య, ఆరోగ్య శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఏపీఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు పాల్గొన్నారు.

సిరి గోల్డ్ బాధితుల సమావేశం



నెల్లూరు రూరల్: మూలాపేటలోని నెక్లెస్ రోడ్డులో సిరిగోల్డ్ బాధితులు శుక్రవారం సమావేశమయ్యారు. తమ సమస్యల పరిష్కారానికి గానూ ప్రభుత్వ పెద్దలను కలవాలని నిర్ణయించారు. బీజేపీ నేత మిడతల రమేష్, సిరిగోల్డ్ బాధితులు నాగేశ్వరరావు, కృష్ణ, చింతగింజల సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, వెంకటయ్య, సుజాత, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో నెల్లూరీయుల ప్రతిభ



రాకేష్ కార్తీక్



నాగదర్శన్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): బెంగళూరులో ఇటీవల నిర్వహించిన రోలర్ స్కేటింగ్ జూనియర్ నేషనల్స్ చాంపియన్‌షిప్‌లో నెల్లూరీయులు ప్రతిభ చూపి పతకాలు సాధించారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, కామేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడారు. వాకా రాకేష్ కార్తీక్ రజత.. నాగదర్శన్ కాంస్య పతకాలను సాధించారని వివరించారు.

హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థాన హుండీ కానుకలను లెక్కించారు. ఈ ఏడాది ఆగస్ట్ ఆరు నుంచి శుక్రవారం వరకు కానుకల రూపంలో రూ.3,22,963 మేర భక్తులు సమర్పించారని ఈఓ కవిత తెలిపారు. కార్తీక మాసంలో టికెట్ల విక్రయం ద్వారా రూ.3.5 లక్షలు సమకూరాయని చెప్పారు. దేవదాయ శాఖ నెల్లూరు ఇన్‌స్పెక్టర్ సుధీర్ పర్యవేక్షించారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (పొగతోట): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలను నగరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహం, చిత్రపటాలకు నివాళులర్పించారు.

➡ జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, ఏపీఎస్సైఆర్డీ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బారకాసు): అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, ఉపాధ్యక్షుడు హంజా హుస్సేనీ, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, నేతలు యస్దానీ, కరిముల్లా, అలీం, పెంచలయ్య, విద్యార్థి విభాగ నేత శేషసాయి తదితరులు పాల్గొన్నారు.

➡ నగరపాలక సంస్థ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి.. వీఆర్సీ సమీపంలోని ఆయన విగ్రహానికి మేయర్ స్రవంతి నివాళులర్పించారు. అదనపు కమిషనర్ నందన్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యాంగ ప్రతిజ్ఞను అధ్యాపకులు, విద్యార్థులు చేశారు. ఆర్‌ఐఓ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, ఎన్నెస్సెస్ ప్రోగ్రామ్ అధికారులు కరుణకుమారి, ప్రసన్న, భారతి, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, వెంకట్రావు, చంద్రకళ, శ్రీదేవి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

➡ కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, కిరణ్, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేశారు. నగరంలోని జనార్దన్‌రెడ్డికాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. దివ్యాంగుల ఐక్యసంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, బ్లాక్‌బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు నరసాపురం ప్రసాద్, జక్కావుల్లా, రవి, శీనయ్య, సుభానీ తదితరులు, పాల్గొన్నారు.

నెల్లూరు (లీగల్): జిల్లా కోర్టు సముదాయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, న్యాయవాది జల్లి పద్మాకర్, బార్ ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రంగారావు, బద్దెపూడి రవీంద్ర, చలపతి, రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు తమ్మినేని పాండు తదితరులు పాల్గొన్నారు.

➡ వీఆర్సీ సెంటర్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాస్టర్ గడ్డం హనోక్, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఆత్మకూరు రమేష్, సుదర్శన్‌రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి సునీల్ గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ కార్యాలయంలో..



కార్పొరేషన్ కార్యాలయంలో..



డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో..



కొండాయపాళెంలోని స్కూల్లో..



జనార్దన్‌రెడ్డికాలనీలో..



బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



గీతామయి వృద్ధాశ్రమంలో..